




అగ్నిప్రమాద బాధితులకు మౌలిక వసతుల కల్పన

ప్రజాశక్తి-నెల్లూరు: నగరపాలక సంస్థ పరిధిలోని బర్మాషల్ గుంట, రంగనాయకుల పేట ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాద బాధితులను కమిషనర్ వికాస్ మర్మత్ పరామర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాధితులకు వెంటనే తాగునీరు, పారిశుద్ధ్యం, మెడికల్ క్యాంపులను తక్షణమే ఏర్పాటు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. బాధితులకు గ్యాస్ సిలిండర్లు అందచేసే వారికి గతంలో కేటాయించిన ప్రభుత్వ గృహాల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయుటకు సంబంధిత శాఖల వారికి ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు సంబంధిత సిబ్బంది బాధితులకు తక్షణమే మంచినీరు ఏర్పాటు చేసి పారిశుద్ధ్యం చర్యలు చేపట్టారు. ప్రమాద ప్రదేశంలో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి అవసరమైన మందులను సరఫరా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి.చెన్నుడు, ఎస్.ఇ.సంపత్ కుమార్, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న కమిషనర్

కార్పొరేషన్‌లో 'ఫోర్జరీ' కుదుపు..!

- ◆నలుగురు అధికారులు సస్పెన్షన్
- ◆విజిలెన్స్ చేతికి అధికారుల చిట్టా
- ◆వైసిపి కార్పొరేటర్లు కొందరు
- ◆అధికార టిడిపి నేత ఒకరు కీలకపాత్ర

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో గత అధికారపార్టీ నేతల అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఏకంగా ఐఎఎస్ అధికారుల సంతకాలనే ఫోర్జరీ చేసి భారీగా అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుత కమిషనర్ వికాస్ మర్మత్, గత కమిషనర్ డి.హరిత సంతకాలు ఫోర్జరీ చేశారని తెలుస్తోంది. అంతా వైసిపి నేతల హవా కావడంతో మనల్ని అడిగేదెవరని రెచ్చిపోయారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో వ్యవహారం బయటకొచ్చింది. ఇందులో వైసిపి కార్పొరేటర్లు, టిడిపిలో ప్రస్తుత ముఖ్య నేత హస్తం ఉన్నట్లు సమాచారం. మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్ ఇద్దరు టిపిఒలు, ఇద్దరు డబ్ల్యు ఆర్ఎస్‌లను సస్పెండ్ చేశారు. విజిలెన్స్ అధికారుల చేతికి చిట్టా అందింది. కేసు ఎందుకు పెట్టలేదనే అనుమానం వస్తుంది.



ప్రజాశక్తి-నెల్లూరుప్రతినిధి

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రభుత్వానికి చేరాల్సిన నగదును కొందరు వైసిపి నేతలు అప్పనంగా మింగేశారు. అనధికార లెక్కల ప్రకారం 114 ఫైళ్ళు కదిలినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రధానంగా మార్టిగేజ్ వ్యవహారంలో ఒక్కో భవనం, అపార్ట్‌మెంట్ నుంచి రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు దిగమింగారు. వైసిపి అధికారంలోకి రావడం, కార్పొరేషన్‌లో ప్రతిపక్షమే లేకపోవడంతో వ్యవహారం ఆడిందే ఆటగా సాగింది. ఎవరు అపార్ట్‌మెంట్ కట్టినా అక్కడ వాలిపోయి వ్యవహారం నడిపినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు బి. ప్రవీణ్, ఎం. దేవేంద్రులు, 12, 24వ డివిజన్ సచివాలయాల్లో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులుగా విధులు నిర్వహించిన పి. నాగేంద్ర, కె. కార్తిక్ మాల్యాలను సస్పెండ్ చేశారు. వైసిపికి చెందిన కొందరు కార్పొరేటర్లు దగ్గరుండి ఈ అధికారులచే తప్పులు చేయించారని తెలుస్తోంది. అధికారం ఉండడం, కార్పొరేషన్ చేతిలో ఉండడం, ఎంపి, వైసిపి ఇన్‌ఛార్జ్ తమవారే కావడంతో ధైర్యంగా తప్పులు చేశారు. మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తుందని తమకు ఏం జరగదని కొందరు కార్పొరేటర్లు ఒత్తిడి తీసుకురావడంతో కింద స్థాయి అధికారులు ఫైళ్ళు పోర్జరీ చేసినట్లు తెలుస్తోంది. సుమారు 114 ఫైళ్ళు ఇలా జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఏకంగా ఐఎఎస్ అధికారుల సంతకాలతో ఫోర్జరీ చేయడంతో కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు 70 వరకు బిల్డింగ్ యజమానులకు నోటీసులు అందజేసినట్లు తెలిసింది. ఇప్పుడు వైసిపి అధికారం కోల్పోవడం టిడిపి అధికారంలోకి రావడంతో ఈ వ్యవహారం బయట కొచ్చింది. వైసిపి కార్పొరేటర్లతోపాటు, గతంలో వైసిపిలో ఉండి ప్రస్తుతం టిడిపిలోని ఒక నేత పాత్ర కూడా కీలకంగా ఉందని తెలుస్తోంది. ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిల విషయంలో సీరియస్ అయినట్లు తెలిసింది. తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇంత జరిగినా ఇప్పటి వరకు పోలీసు కేసు ఎందుకు పెట్టలేదనే అనుమానాలు కలుగుతున్నాయి. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు సంతకాలే ఫోర్జరీ చేయడంతో కార్పొరేషన్‌లో అలజడి నెలకొంది. కమిషనర్ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న అధికారులు విచారణ చేస్తున్నారు. నలుగురు అధికారులే కుండా ఇంకా ఎంతమంది పాత్ర ఉందని దానిపై విచారణ సాగుతోంది.వైసిపి కార్పొరేటర్ల పాత్ర బయటకొస్తే కేసు నమోదు చేసే అవకాశాలున్నాయి. కార్పొరేషన్ చుట్టూ ఫోర్జరీ ఉచ్చు బిగుస్తోంది. ఏం జరుగుతుందో చూడాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా నిలుస్తా..

ప్రజాశక్తి-నెల్లూరు రూరల్

నియోజకవర్గంలోని ప్రతి వైసిపి కార్యకర్తకూ తాను అండగా నిలుస్తానని, అధికార పక్షం అదిరింపులకు...బెదిరింపులకు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఆ పార్టీ రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రూరల్ నియోజకవర్గంలో విస్తృత స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని, ప్రతి డివిజన్‌ను సందర్శించి వైసిపి కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులు, అభిమానులను స్వయంగా కలుసుకోవడం జరుగుతుందన్నారు. ఆదివారం వారంలోని అన్ని విధాల అండగా ఉంటామని స్పష్టం చేశారు. ముందుగా రూరల్ నియోజకవర్గంలోని 41వ డివిజన్ కార్పొరేటర్ కువ్వాకుల విజయలక్ష్మిని కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం టిడిపి నాయకుల చేతిలో గాయపడిన 29వ డివిజన్‌కు చెందిన షేక్ సాజిద్, అదే డివిజన్ చెందిన వైసిపికి చెందిన సిహెచ్ సూరిబాబు ఇళ్లకు వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆదాల ప్రభాకర్ రెడ్డి కార్పొరేటర్ విజయలక్ష్మి, టిడిపి వాళ్ళ దాడిలో గాయపడిన సాజిద్, అధికార పార్టీ నాయకులు బలవంతంగా కూల్చివేసిన సంఘటనలో నష్టపోయిన సిహెచ్ సూరిబాబు కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి, అధైర్య పడకండి, భయపడకండి, పార్టీ అండగా తోడుంటాం, తాము అందరం అన్ని విధాలా అండగా ఉంటామని గట్టి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుల దాడిలో గాయపడిన 29వ డివిజన్‌కు చెందిన వైసిపి కార్యకర్త షేక్ సాజిద్ కు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, షేక్ సత్తార్, పార్టీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, స్వర్ణ వెంకయ్య, మల్లు సుధాకర్ రెడ్డి, పాశం శ్రీనివాస్, పేర్నాటి కోటేశ్వర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

2

బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

ప్రజాశక్తి -నెల్లూరు

స్థానిక రంగనాయకుల పేటలోని బర్మాషల్ గుంట ప్రాంతంలో అగ్ని ప్రమాద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశం అనంతరం నగరానికి చేరుకున్న ఆయన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అనంత రం ఆయన ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన 15 కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఇల్లు కోల్పోయిన వారికి టిడ్కో ఇళ్లలో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయంగా తాను నిన్న రు.15వేలు, నేడు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిధుల నుంచి రూ. 15 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు.కార్య క్రమంలో కలెక్టర్ ఎం.హరి నారాయణన్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, ఆర్‌డిఒ మలోల, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మేయర్లు అబ్దుల్ అజీజ్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు అందజేస్తున్న నారాయణ

అట్టహాసంగా ప్రమాణ స్వీకారాలు

ఎనిమిది మంది ఎంఎల్‌ఎలు హాజరు



ఆనం రామనారాయణరెడ్డి



పొంగూరు నారాయణ



వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



ఇంటూరినాగేశ్వరరావు



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



కాకర్ల సురేష్



కావ్యకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరుప్రతినిధి: ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ విజయం సొంతం చేసుకున్న ఎంఎల్‌ఎలు శుక్రవారం శాసనసభలో ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి అధ్యక్షత జరిగిన సమావేశంలో ప్రమాణస్వీకారం చేశారు. ఆత్మకూరు నుంచి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు నగరం పి.నారాయణ, సర్వేపల్లి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, కోవూరు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఉదయగిరి కాకర్ల సురేష్, కందుకూరు ఇంటూరి నాగేశ్వరరావు, కావలి కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు రూరల్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ప్రమాణస్వీకారం చేశారు.

వైసిపి నేత "కావల్ రెడ్డి" ఆస్తులు ధ్వంసం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సమీప బంధువు కావల్ రెడ్డి రంగారెడ్డి ఆస్తులను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పలువురు నాయకుల ఆస్తులు విధ్వంసానికి గురైన విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాలు విడుదల అయినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఇటువంటి ఘటనలు చోటు చేసు కోలేదు. ఈ నేప థ్యంలో మండలంలోని కోడూరు వైసీపీ నాయకులు రంగారెడ్డికి చెందిన సుమారు రూ.40 లక్షల విలువైన ట్రాక్టర్, ఏరియేటర్లు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన ఘ టన స్థానికంగా కలకలాన్ని సృష్టిస్తోంది.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బారాషాహిద్ దర్గా రొట్టెల పండగకు లక్షలాదిమంది భక్తులు తరలి వస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ వికాస్ మర్మత్‌కు శుక్రవారం ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మున్సిపల్ శాఖ మాత్యులు పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, అధికారుల సహకారంతో రొట్టెల పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని వసతులను కల్పించి, అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు.నెల్లూరు నగర కార్పొరేషన్‌లో మున్సిపల్ కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి భారీ కుంభకోణానికి పాల్పడడం దురదృష్టకరమని ఇటువంటి చర్యలు పురావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర మంత్రివర్యులు పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నగర మున్సిపల్ కమిషనర్‌లకు సూచించారు. కుంభకోణనికి పాల్పడిన లైసెన్స్ కలిగిన వ్యక్తులకు లైసెన్స్ రద్దు చేసి అధికారులపై తగిన చర్యలు తీసుకొని ఫోర్జరీ సంతకాలు రుజువైతే నలుగురు కార్పొరేటర్ల పై చర్యలు తీసుకోవాలన్నారు.

'బడికి పోతా'

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :బాల కార్మికుల నిర్మూలనే నేను బడికి పోతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల విద్యాశాఖ అధికారి సన్నా రెడ్డి వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శు క్రవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో బాల కార్మికులను నిర్మూలించడం, బడి బయటి పిల్లలను పాఠశాలలలో చేర్చడం అనే కార్యక్రమంపై విద్యాశాఖ, జిల్లా కార్మిక శాఖ, పోలీస్ శాఖ, ఎన్జీవో, బచ్పన్ బ చావో ఆందోళన్ కు సంబంధించిన అధికారుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఒ వేణుగో పాల్ రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖలను సమన్వయం చేసుకొని బాల కార్మికులు లేని, బడి బయట లేని పిల్లలు గల మండలం గా చేయడమే ఇటీవల ప్రభు త్వం చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వి ద్యాశాఖ అధికారి -2 డి.జయరామ నాయుడు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు రామారావు, శ్రీనివాసు నాయుడు, అనిల్, చైతన్య జ్యోతి, శ్రీనివాసులు, ఖాదర్‌బాషా, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నాడు కౌరవ సభ..నేడు గౌరవ సభ..

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ: గత ఐదేళ్ల వైసిపి పాలనలో శాసనసభను కౌరవ సభగా మార్చి ప్రతిపక్ష నేతలపై మాటలతో దాడి చేసి అవమానించారని దీంతో ప్రజలు వైసిపికి ప్రతిపక్ష హోదా లేకుండా చేసి ఎన్డీఏ కూటమికి భారీ మెజార్టీ అందించడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాసనసభను నేడు గౌరవ సభగా మార్చారని నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్ ఖాన్ పేర్కొన్నారు. నెల్లూరు టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ రాష్ట్ర స్థితిగతులను మార్చే చట్టాలు చెయ్యాల్సిన శాసనసభలో గత ముఖ్యమంత్రి మొదలు మంత్రులు వైసిపి శాసనసభ్యులు ఇష్టారీతిగా ప్రతిపక్షాలను దుర్భాషలాడుతూ కౌరవసభగా మార్చారన్నారు.

నలుగురు అధికారులు సస్పెన్షన్

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, సంతకం ఫోర్జరీ వ్యవహారంలో ముందస్తు విచారణ అనంతరం ఇద్దరు టౌన్ ప్లానింగ్ అధికారులు, మరో ఇద్దరు సచివాలయ వార్డు ప్లానింగ్ అండ్ రెగులేషన్ కార్యదర్శులను బాధ్యులుగా గుర్తించి వారిని విధులనుంచి తొలగిస్తూ సస్పెన్షన్ ఉత్తర్వులను కమిషనర్ జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు.

పలుచోట్ల యోగా దినోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న ఉప కులపతి సుందరవల్లి

ప్రజాశక్తి-వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వ ర్యంలో ఇషా ఫౌండేషన్ వారి సహకారం 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడు కలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి ముఖ్య అతి థిగా పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారం భించారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ రోజు ప్రపంచం మొత్తం యోగాను దైనందిన జీవితంలో ఒక భాగం గా అలవాటు చేసుకున్నా రన్నారు.కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్ శంకర్, అల్లం, ప్రోగ్రాం అధికారి డా. కె.సునీత, పిడి ప్రవీణ్ కుమార్, ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న అడిషనల్ ఎస్‌పి

అడిషనల్ ఎస్‌పి ఆధ్వర్యంలో

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రశాంతంగా, ఆరోగ్యంగా జీవించడానికి యోగ సాధన తోడ్పడుతుంది- అడిషనల్ ఎస్.పి. (ఏఆర్) జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకోని ఎస్‌పి కె.ఆరీఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ ఎస్.పి. (ఏఆర్) జిశ్రీనివాసరావు, నగర డిఎస్‌పి శ్రీనివాసులరెడ్డి ఇతర పోలీసు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి మాట్లాడారు.కార్యక్రమంలో సంతపేట సిఐ సుబ్బరాజు, ఆర్ఐ అడ్మిన్ హరిబాబు, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, ఆర్ఐ ఎం.టి అంకమ రావు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కూల్

ప్రజాశక్తి-నెల్లూరు: యోగతోనే శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని, ఈ నేపథ్యంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్న యువతరం యోగాను తమ జీవన విధానంలో భాగం చేసుకోవాలని, రోజుకు కనీసం ఓ గంట యోగ సాధన కొనసాగిం చాలని వక్తలు అభిప్రాయపడ్డారు. 10వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగ మిత్రమండలి - నెల్లూరు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం - నెల్లూరు, నెహ్రూ యువకేంద్ర, పి.ఎం.పి. అసోసియేషన్, రుడ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు డి.కె.జూనియర్ కళాశాల వసతిగృహంలో యోగ సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హరికష్ణ, విజయ్ కుమార్ రెడ్డి, రవీంద్ర, పద్మావతి, నాగూర్ గురూజీ, తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో

ప్రజాశక్తి-నెల్లూరు: నిత్యం యోగా చేస్తే ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవని, శారీరకంగానే కాకుండా మానసికంగానూ ప్రశాంతంగా ఉండ వచ్చునని నెల్లూరులోని మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బింధు రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో యోగా నిపుణులు ప్రసన్న కుమార్, స్వప్నలు యోగాసనాలు వేయించారు. యోగాలో ఉన్న ఆసనాలు వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం డాక్టర్ బింధు రెడ్డి మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళన, నిరాశ, భయం, ఇతర ఆరోగ్య రుగ్మతలను విజయవంతంగా జయించవచ్చునని అన్నారు. ఊబకాయం, గుండె జబ్బులు, కాలేయ సమస్యలు కూడా యోగాతో దరిచేరవని వెల్లడించారు. షుగర్ వ్యాధితో బాధ పడే వారు నిత్యం యోగా చేస్తే షుగర్ లెవల్స్ స్థిరంగా ఉంటాయని తెలియజేశారు.

ఎంఎస్ఆర్ స్పాస్టిక్స్ సెంటర్‌లో

ప్రజాశక్తి-నెల్లూరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ పరిధిలోని ఎంఎస్ఆర్ స్పాస్టిక్స్ సెంటర్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్పాస్టిక్ సెంటర్ అడ్వయిజర్, కేంద్ర ప్రభుత్వం న్యాయ వాది దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 2015 జూన్ 21 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. యోగా వల్ల శారీరక మానసికంగా ఎదుగుదల ప్రాప్తిస్తుందన్నారు. ప్రతిరోజూ ఒక గంట పాటు యోగ ఆసనాలు అభ్యసించడం వల్ల గుండె కోశ వ్యాధులు, బిపి, షుగర్ తదితర వ్యాధులను అదుపులో ఉంచే అవకాశం ఉంటుందన్నారు.కార్యక్రమంలో ఉమామహేశ్వరి, వాసు, స్పాస్టిక్ సెంటర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు



యోగా చేస్తున్న దృశ్యం

కృష్ణపట్నం సిఇఒ జిజె రావు

ప్రజాశక్తి -తోటపల్లిగూడూరు: యోగాభ్యాసం చేయడం ద్వారా ప్ర శాంతత లభ్యమౌ తుందని ఆదాని కృష్ణపట్నం పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జిజె రావు పేర్కొన్నారు. శుక్రవారం కష్ణపట్నం పోర్టులో పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక లు జరిగాయి. ఈ కార్యక్రమంలో సీఈఓ జిజె రావు ము ఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ యోగాతో ఆరోగ్య, శారీరక, మానసిక, ఉల్లాసం కలుగుతుం దన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగ ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ' అనే థీమ్‌తో జరుపుకొంటునట్లు తెలిపారు. యోగ గురువు శివ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యం లో పోర్ట్ ఉద్యోగులు యోగ చేశారు.కా ర్యక్రమంలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయ్ భాస్కర్, సిఓఓ రాజన్ బాబు, అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, ఏజి ఎం. గంగా సతీష్, వివిధ విభాగాల హెచ్ఒ డిలు, ఉద్యోగులు అడ్మిన్ టీమ్, తదితరులు పాల్గొన్నారు.

డికె బాలికల ప్రభుత్వ కళాశాల

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ: పరుగుల ప్రపంచంలో మనిషి జీవన ప్రమాణాలు దెబ్బతిం టున్నాయని.. యోగ సొంతానికి కాదని, సమాజానికి అవసరమని దీంతో మానసిక వికాసం వికసిస్తుందని డీకే బాలికల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్, ప్రాంతీయ జిల్లా పర్యవేక్షణాధికారి ,ఏ శ్రీనివాసులు పేర్కొన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్లో శుక్రవారం యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక వికాసానికి యోగ ఎంతో ఉపయోగ పడుతుం దన్నారు. చిన్న విషయాలకు కూడా ఒత్తిడికి గురై మానసిక శోభకు గురవుతున్నా రన్నారు. ఒత్తిడి లేని సమాజం కోసం యోగా అవసరమన్నారు.కళాశాల జాతీయ సేవా పథకం విభాగాల ఆధ్వర్యంలో ,భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ బీ నెహ్రూ యువ కేంద్ర, యోగ మిత్ర మండలి, పి హెచ్ పి,రూడ్స్ ,బ్లాక్ బోర్డ్ మిత్రమండలి సంస్థల సౌజన్యంతో దాదాపు 400 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఫీల్డ్ పబ్లిసిటీ అసిస్టెంట్ హరికృష్ణ మాట్లాడుతూ జూన్ 21వ తేదీనే యోగా దినోత్సవాన్ని నిర్వహించే ప్రాముఖ్యతను విశదీకరించారు. యోగా మాస్టర్ నాగూరు గురూజీ ప్రసంగిస్తూ భారతీయ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన యోగా గొప్పతనాన్ని కొనియాడారు. పి హెచ్ పి జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాలు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా ప్రపంచంలోని అనేక దేశాలు ,యోగా విశిష్టతను గుర్తించి తమ ప్రాంతాల్లో సంబంధిత కార్యక్రమాలు చేపడుతున్నా యని వివరించారు.

టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో



టి.ఆర్.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు టి.ఆర్.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ శాస్త్ర విభాగం, ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అనే ఇతివృత్తంతో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రవికుమార్ ప్రసంగిస్తూ యోగా అనేది శారీరక ,మానసిక ఆరోగ్యాలను కాపాడే దివ్య ఔషధంగా పేర్కొన్నారు.వ్యాయామ శాస్త్ర అధ్యాపకులు శ్రీ. కె.కరుణ రత్న కుమార్ అధ్యాపకులు విద్యార్థులతో ఆసనాలు వేయించారు.తెలుగు అధ్యాపకురాలు డా.కె.సుజాత మరి కొన్ని ఆసనాలను సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, డా.ఏడుకొండలు నరేంద్ర, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నరేష్ రాజా, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.



బాలుర ఉన్నత పాఠశాలలో

ప్రజాశక్తి-కందుకూరు

అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం కందుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది.. స్థానిక పాఠశాల ప్రధానోపా ధ్యా యులు నరసింహమూర్తి అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో కందుకూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ప్రసాదరావు, మండల విద్యాశాఖ అధికారి కూనం సుబ్బా రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉప విద్యాశాఖ అధికారి మాట్లాడారు.

ప్రజాశక్తి ఉలవపాడు:

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉలవపాడు జీ వి ఎస్ ఎం ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో శుక్రవారం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవి ఎల్ సుధారాణి అధ్యక్షతన ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, ఉమెన్స్ ఎంపైర్మెంట్ సెల్ వారి ఆధ్వర్యంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడారు.

ఆస్తులు ధ్వంసం పిరికి చర్య..!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఆస్తులు ధ్వంసం చేయడం పిరికి పంద చర్యని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్త కోడూరు వైసీపీ నాయకులు కావల్ రెడ్డి రంగారెడ్డికి చెందిన సుమారు 50 లక్షలు విలువై న ట్రాక్టర్, ఏరియేటర్లను గుర్తు తెలియని వ్యక్తులు శుక్ర వారం ధ్వంసం చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మాలకొండ హుండీల ఆదాయం రూ.125,69,286 వలేటివారిపాలెం, జూన్ 21 మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి భక్తుల నుండి 12 శనివారాలకు 34 హుండీల ద్వారా రూ.1,25,69,286 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.కళ్యాణ మండపంలో శు క్రవారం కందుకూరు గ్రూప్ టెంపుల్ కార్యనిర్వాహణాధికారులు వై బైరాగిచౌదరి, వివిఎల్ రవీంద్రనాథ్ పర్యవేక్షణలో శుక్రవారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఆ లెక్కింపులో పైన సూచించిన నగదుతో పాటు 271 గ్రాములు బంగారం, 2 కేజీల 30 గ్రాములు వెండి, 250 యూఎస్ డాలర్లు. 2 వేల నిప్పోన్ డాలర్లు, 200 యూఏఈ డైమండ్స్, 12 శింగపూర్ డాలర్లు, 20 ఎస్ డాలర్లు, 1 బూటాన్ డాలర్, 200 ఇంగ్లండ్ పౌండ్స్ లభించినట్లు తెలిపారు.

చిన్నారికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు

చిన్నారి షేక్ ఆర్మాన్ కొద్దిరోజులుగా లివర్ ప్రాబ్లం తో విజయవాడలోని చిన్న పిల్లల రైన్బో హాస్పిటల్ చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై సోషల్ మీడియా వేదికగా తెలియపరచగా కందుకూరు, చుట్టుపక్కల నుండి చిన్నారి కోసం అనేకమంది దాతలు ముందుకు వచ్చి తోచినంత సహాయం చేశారు. ఈ సహాయం మొత్తం అక్షరాల ఆరు లక్షల 59 వేల రూపాయలు. ఈ డబ్బులు మొత్తం శుక్రవారం విజయవాడ రైన్బో హాస్పిటల్ లో చిన్నారి తల్లిదండ్రులైన షేక్ ఆరిఫ్ షేక్ ఆఫ్రిన్లకు అందజేయడం జరి గింది. తల్లిదండ్రులు మాట్లాడుతూ దాతలు చేసిన సహాయాన్ని ఎప్పటికీ మరువబోమని జీవితాంతం వాళ్లకి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ బహత్కర సహాయ కార్యక్రమానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సోషల్ మీడియాలో విస్తతంగా ప్రచారం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ మున్న షేక్ సలీమ్ షేక్ హబీబుల్లా షేక్ ఇసాక్, షేక్ అజీమ్ షేక్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటూరి' మార్క్ పాలన మొదలైంది..



ప్రజాశక్తి-కందుకూరు : ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ప్రజా సమస్యలపై కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టి పెట్టారు.కందుకూరు పట్టణం విప్పగుంటరోడ్డులోని వాకలికుంట వద్ద కల్వర్టుకు రంధ్రంపడి 3 నెలలుగా రాకపోకలు నిలిచిపోయాయి.దాదాపు 10 గ్రామాలకోసం వారు, పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త కల్వర్టు నిర్మాణానికి 7.5 లక్షలు మంజూరైనా పనులు జరగలేదు.ఎన్నికలకు ముందు ఇంటింటి ప్రచారంలో భాగంగా ఇంటూరి నాగేశ్వరరావు దీనిని పరిశీలించి కొత్త కల్వర్టు పనులు మొదలుపెట్టాలని అధికారులను స్వయంగా విన్నవించిన పట్టించుకోలేదు. ఈ లోపు ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఎమ్మెల్యే కాగానే ప్రజా సమస్యల పరిష్కారానికి నడుం బిగించిన నాగేశ్వరరావు కల్వర్టు విషయంపై దృష్టి పెట్టారు. వర్షాలు కురిసి కుంటలోకి నీరు చేరితే పనులు చేయడానికి సాధ్యపడదన్న ఆలోచనతో వెంటనే కల్వర్టు పనులు మొదలు పెట్టించారు. మూడురోజుల నుంచి పనులు మొదలు కాగా పాత కల్వర్టును కూల్చి కొత్త కల్వర్టు కోసం కాంక్రీట్ బెడ్ వేశారు. మరో పది రోజుల్లో నిర్మాణం పూర్తి కానుంది. మాటల్లోనే కాదు, చేతల్లో చూపిస్తున్న నాయకుడు మన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అంటూ కల్వర్టు విషయంలో ఎమ్మెల్యే చూపిన చొరవను ప్రజలు ప్రశంసిస్తున్నారు.

12వ వార్డులో ఎన్నికలు జరిపించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ ఎన్నికైన వైసిపి సభ్యులు కొండ యుగంధర్ మరణించి నేటితో చాలా కాలం గడిచింది. ఆ వార్డులో ప్రజల సమస్యలు పెరుగుతున్నా పరిష్కరించడానికి ఏ ప్రజాప్రతినిధి లేరు. ప్రజలు ప్రజా సమస్యలతో బాధపడుతున్నారు. తమ వార్డులో ఉప ఎన్నికల నిర్వహించాలని నెల్లూరు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెం నాగరాజు శుక్రవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ మధులతను కలిసి వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆర్‌డిఒను కోరినట్లు తెలిపారు.

విద్యార్థినికి చేయూత

ప్రజాశక్తి-కోవూరు : 2023-24 పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి ప్రతి ఏడాది నగదు ప్రోత్సాహం ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందని ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాధారాణి అన్నారు. పాఠశాల ఆవరణంలో శుక్రవారం మంచి మార్కులు సాధించిన విద్యార్థిని పొట్టూరి చరిత సాయి 528 మార్కులు సాధించింది. అందుకు గానూ అభివృద్ధి ప్రదాత మారంరెడ్డి బలరామిరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా బలరామిరెడ్డి మాట్లాడుతూ తాను చదువుకొన్న పతనలకు తనవంతు సహాయం చేయాలన్న తలంపుతో ప్రతియేడాది ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం ఆయన్ను సన్మానించి అభినందించారు.

రూ.20వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలో శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రవాస భారతీయులు పేరూరి శంకర్రావు శుక్రవారం సందర్శించారు. కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి, వారు కుట్టిన డ్రస్సులను పరిశీలించారు. ప్రతి మహిళ వారి కాళ్లపై వారు నిలబడి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ప్రవాస భారతీయులు అయిన సతీష్ శ్రీధర సహకారంతో అనారోగ్య సమస్యతో బాధపడుతున్న హేమంత్ కుమార్ అనే 5 సంవత్సరాల బాబుకు రూ.10వేలు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్‌కె సుమియాకి ఫీజు నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ప్రవాస భారతీయులు పేరూరి శంకర్రావు అధ్వర్యంలో అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పేరూరి శంకర్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుగుణ జనర్ధన వైద్య నిర్వాహకులు కనకేశ్వరరావు, కమలకుమార్, ఆశూరి పద్మావతి, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు అయిన పేరూరి శంకర్రావు మాట్లాడుతూ జీవనోపాధి పొందేందుకు కుట్టు మిషన్లు ఎంతో ఉపయోగపడతాయని ఆ బాటలో వారికి ఉచితంగా శిక్షణ ఇస్తూ కుట్టు మిషన్ కూడా అందజేయడంలో శ్రీ సాయి చారిటబుల్ మాధవ సఫలీకృతులు అయిందని అభినందించారు. సుగుణ వైద్యశాల నిర్వాహకులు మాట్లాడుతూ పేరూరు శంకర్రావు శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను గుర్తించి అభినందనీయమని భవిష్యత్తులో ట్రస్ట్ వ్యవస్థాపకులు మాధవి మహిళలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న శంకర్రావు గత ఆరు సంవత్సరాలుగా దాదాపు 1000 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వడంలో కాక దాదాపు 500మందికి పలువురు సౌజన్యంతో కుట్టు మిషన్లు అందజేశామని, గతంలో శంకర్రావు సహకారంతో కూడా కుట్టుమిషన్లు అందించామన్నారు.

'బడికి పోతా..'

ప్రజాశక్తి-గుడ్లూరు : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులను ఈనెల13 నుంచి 12 వరకు నేను బడికి పోతాను అనే కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపిడిఓ వై వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లల్ని చేర్చే విధంగా ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని ప్రభుత్వ స్కూల్లో చదివిన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పథకాలతో ఒత్తిడి లేని విద్య అందించడం జరుగుతుందని తెలిపారు.

ఇల్లు కూల్చివేత దుర్మార్గమైన చర్య

ప్రజాశక్తి-కావలి : 13వ వార్డు పుల్లారెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న వైసిపి నాయకులు మన్నెమాల శ్రీనివాసులు రెడ్డి ఇంటిని తెలుగుదేశం నాయకులు అధికార దుర్వినియోగంతో జెసిబిల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపడానికే దురుద్దేశంతో వారు నిర్మించుకుంటున్న ఇంటిని జెసిబితో కూలదోయడం దుర్మార్గమైన చర్యగా కావలి తాజా మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాపకుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బాధితుని కూలగొట్టిన ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రైతు మన్నెమాల శ్రీనివాసులు రెడ్డి వారి జీవనాధారమైన పొలంలో గడ్డి వేసుకొని, బర్రెలు మేపుకొని, పాలు పిండుకొని, వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో ఇల్లు కట్టుకుంటే ఆ ఇల్లును తొలగించడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ అధికారంలో ఉండగా బీద మస్తాన్ రావు ఎంఎల్ఎగా ఉన్నప్పుడు ఆర్‌డిఒ పట్టా ఇచ్చినట్లు తెలిపారు. మన్నెమాల శ్రీనివాసులు రెడ్డి ఇల్లు కట్టుకోవాలి అనుకుంటే వైసిపి ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడే కట్టుకునేవారని, కానీ ఆ తన స్థలం కాబట్టి ఎప్పుడైనా ఇల్లు కట్టుకోవచ్చనుకుని ఎన్నికల తర్వాత అక్కడ ఇంటిని నిర్మించుకుంటుండగా, తెలుగుదేశం నాయకులు కక్షపూరితంగా మన్నెమాల శ్రీనివాసులు రెడ్డి, ఆయన భార్య వేడుకుంటున్నా కూడా ఇంటిని కూలదోయడం చాలా దుర్మార్గమైన చర్య అని తెలిపారు. జరిగిన జులుంలో కక్షల రాజకీయాలను వదిలి కావలి నియోజకవర్గ ప్రజలను అభివృద్ధి చేయాలని దానికి తమ పూర్తి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయనవెంట కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-మర్రిపాడు : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించామని జిల్లా అధ్యక్షులు సురేంద్ర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎపిటిఎఫ్ నిరంతరం రాజీలేని పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించుకోవడంలో ముందు ఉంటున్నారు. శుక్రవారం మండలంలోని, కదిరినాయుడుపల్లి, చిట్టెం పేట, కంపసముద్రం, బ్రాహ్మణపల్లి, కాంప్లెక్స్‌లోని ఎక్కువ మంది ఉపాధ్యాయులు సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. అలాగే ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన 117 జిఒను రద్దుచేసి, 3, 4, 5 తరగతులను వెనక్కి పంపి తెలుగు ఇంగ్లీష్ మీడియంలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లురాజు, సుబ్బారెడ్డి, శివయ్య, నాగరాజు, పెంచలయ్య, సంధాని బాషా, కరీం మొహిద్దీన్ పాల్గొన్నారు.

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-కావలి : అసెంబ్లీలో కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి కావలి శాసనసభ్యులుగా అత్యంత భారీ మెజారిటీతో గెలిచి, శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా టిడిపి నాయకులు సంబరాలు నిర్వహించారు. 20వ వార్డు ఇన్‌ఛార్జి చెన్నంశెట్టి పెంచలయ్య, 24వ వార్డు ఇన్‌ఛార్జి కావేటి చిన్నకోటయ్య ఆధ్వర్యంలో పాండురు మురళీకృష్ణ సహకారంతో 20వ వార్డులోని గవర్నమెంట్ స్కూల్ పిల్లలకు, అంగన్‌వాడీ స్కూల్ పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు, అరటి పండ్లు, సమోసా, క్రీమ్ బ్రెడ్, కూల్ డ్రింక్ బాటిల్, పెన్నులు, పెన్సిల్, స్టేషనరీ అందించారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు నాయకులు పాండురు మురళీకృష్ణ, ఆలా శ్రీను, దేవరకొండ శ్రీను, జనసేన సాయి విఠల్, అలహరి నరసింహారావు, కనక కేటి రామకృష్ణ, వాయునంద వెంకటేశ్వర్లు, ఎర్రంశెట్టి గోపాల్, పసుపులేటి చంద్రశేఖర్, అవులమంద శ్రీనివాసులు, కావేటి శివకుమార్, ఎస్‌కె రహంతు, ఎస్‌కె బాషా, ఎర్రశెట్టి ఉదయ్, సురేంద్ర, వాసు, సురేష్, రూపేష్, మధు, పాపిశెట్టి సురేష్, తిరుపతి, పాతం శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి-కోవూరు : బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోవలూరు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల తెలిపారు. మండల కేంద్రమైన కోవలూరులో ఎంపిపి పాఠశాలలో ఐదు సంవత్సరాలు దాటిన 15మంది పిల్లలను సెక్టార్ సూపర్‌వైజర్ నిర్మల శుక్రవారం పిల్లలను పాఠశాలలో చేర్పించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగరాజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా యోగా దినోత్సవం



ప్రజాశక్తి-మర్రిపాడు : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలలో నెహ్రూ యువ కేంద్ర ఎన్వైకెఎస్ జిల్లా యూత్ ఆఫీసర్ ఎ.మహేంద్రరెడ్డి వారి సౌజన్యంతో ఆత్మకూర్ ఎస్ఆర్ఇడి స్వచ్ఛంద సేవాసంస్థ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి వాగాల శ్రీహరి అధ్యక్షతన నిర్వహిపించారు. యోగా డే కార్యక్రమాన్ని ఆదర్శ పాఠశాల సైన్స్ టీచర్ వై.చంద్రావతి ద్వారా ఆసనాలను, యోగా కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎస్ ఎస్ శ్రీనివాస్ కుమార్, పిఇటి అప్రోచ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. యోగా ఆసనాలు వల్ల జరిగే ఉపయోగాలు గురించి, ఆరోగ్య సమస్యల గురించి సంస్థ అధ్యక్షులు శ్రీహరి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువ కేంద్ర గ్రామ మండల వాలంటీర్స్ కె.రమేష్, గౌతమి, ఎపి మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయినీలు విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్స్ సంస్థ ఆర్గనైజర్స్ సుమారు 200 మంది హాజరయ్యారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : యోగా చేయడం వల్ల మానసిక ఉల్లాస కలుగుతుందని ఆత్మకూరు ఉప విద్యాశాఖ అధికారి కె.గోపాల్ పేర్కొన్నారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ యోగాతో విద్యార్థులకు మానసిక శారీరక ఉల్లాసం కలుగుతుందని, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనంతలక్ష్మి, వార్డ్ కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ మల్లికార్జున, మండల విద్యాశాఖాధికారి చలపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : కావలి డాక్టర్ లక్ష్మి కృష్ణారావు విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నెల్లూరు నెహ్రూ యువ కేంద్రం యూత్ కోఆర్డినేటర్ ఇ.మహేంద్రరెడ్డి సౌజన్యంతో ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షులు, షేక్ ఖాదర్‌బీ, రహీమ్ చారిటబుల్ ట్రస్ట్ అబ్దుల్ అలీం, గుడ్‌మెన్ చారిటబుల్ ట్రస్ట్, బ్రహ్మయ్య టైమ్ టు హెల్ప్ నందిపాటి రమేష్ ఆధ్వర్యంలో యోగ గురువు ఎం.గోపాల్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా యోగా గురువు గోపాల్, ముఖ్య అతిథి కావలి ఫైర్ సర్వీస్ ఆఫీసర్, రామ్ సిద్ధార్థ మాట్లాడుతూ ఈ యోగా ఆసనాలు విద్యార్థులు ప్రతిరోజు చేయడం వల్ల, మంచి ఆరోగ్యం, సంతోషం, జ్ఞాపకశక్తి, క్రమశిక్షణ, పెరుగుతుందని సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాధనోపాధ్యాయులు ఎన్.ద్వారక నాథ్ చౌదరి, జి.కళ్యాణి, పిఇటి శివ కుమార్ రెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు, షేక్.ఖాదర్ బాషా, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఎంవిఎన్.ప్రసాద్ రావు, ఘంటశాల రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని గుంపర్లపాడు గ్రామంలో శుక్రవారం యోగా డే ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్-2లో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో యోగా చేయించారు. కార్యక్రమంలో ఎంఎల్ హ్చ్ పీ మంజుల, ఎఎన్ఎం శిరీష, హెల్త్ అసిస్టెంట్ పోలిరెడ్డి, ఆశావర్కర్స్ పద్మ, రమ్య, సచివాలయం సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బిట్రగుంట బ్రోకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, అధ్యక్షులు సజ్జన్ రాజ్ ఫౌండర్ కుందుర్తి శ్రీనివాసులు బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ క్రీడా మైదానంలో శుక్రవారం యోగా మాస్టర్ శుభ ప్రసాద్ ఆసనాలు నేర్పించారు. కార్యక్రమంలో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, జర్నలిస్టులు, విశ్రాంతి రైల్వే ఉద్యోగులు, రిటైర్డ్ మిలటరీ ఉద్యోగస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినం ఘనంగా నిర్వహించారు. జవహర్ భారతి డిగ్రీ కళాశాల, మినీ ఇండోర్ స్టేడియంలో పట్టణంలోని పలు యోగా కేంద్రాలకు చెందిన యోగా సాధకులు, పలు విద్యా సంస్థలకు చెందిన ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సుమారు 600మంది సామూహిక యోగా ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రముఖ యోగా శిక్షకులు జనార్ధన్ రెడ్డి గురూజీ, సావిత్రి గురూజీలు యోగా ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపియస్ ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, అటవీ శాఖ అధికారి ప్రవీణ్, రోటరీ క్లబ్ అధ్యక్షులు చెన్నంశెట్టి దినేష్, యోగా నిపుణులు నల్లూరు రవికుమార్ పట్టణంలోని పలు యోగా కేంద్రాలలో నిర్వాహకులను జ్ఞాపికలతో సత్కరించగా, రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కన్వీనర్ కె.హరినారపరెడ్డి ఎంఎల్‌ఏ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సందేశాన్ని చదివిన వినిపించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ ప్రతినిధులు డి.రవిప్రకాష్, డాక్టర్ కె.మాధవరెడ్డి, స్వర్ణలత, వెంకటసుబ్బయ్య, ఓరుగంటి వెంకటేశ్వర్లు, మొగల్ సలీమ్ బేగ్, రమేష్ రెడ్డి, షమా రహీమ్, జవహర్ భారతి కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ మాల్యాద్రి, అభయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఇలింద్ర శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : శారీరక మానసిక దృఢత్వానికి యోగా అవసరమని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా ఉన్నత పాఠశాల గడ్డంవారిపల్లి పాఠశాలను సందర్శించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఏ మాలకొండయ్య, ఉపాధ్యాయ బృందం మండల విద్యాశాఖ అధికారిని ఘనంగా సన్మానించారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రయోజనాలపై ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి అంజయ్య అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాల వల్ల కలిగే ఉపయోగాలను కోర్టు సిబ్బంది, పోలీసులకు, న్యాయవాదులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఐ గిరిబాబు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు పట్టణంలో న్యూ లిటిల్ ఫ్లవర్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు యోగా గురువులు మాట్లాడారు. ఆధునిక యాంత్రిక జీవనంలో మానవులు ఎన్నో ఆటుపోట్లకు, మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు. ఎ.నారాయణ, నెల్లూరు సహజ యోగా కోఆర్డినేటరు పి.విష్ణుప్రసాద్, కోవూరు సిహజ యోగా కోఆర్డినేటర్, మాజీ కో-ఆర్డినేటర్లు ఎ.సుబ్బారావు, డి.నరసింహారావు, ఎ.సరోజిని, సర్వాతిటిల్ ఫ్లవర్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వై.నందకిషోర్, డైరెక్టర్స్ వై.అనిత, మెడెమాస్టర్ జి.కోటయ్య బాలసుబ్రమణ్యం. ఉపాధ్యాయులు ఉన్నారు.



'శేషు'స్కూల్లో యోగా డే

ప్రజాశక్తి-నెల్లూరు : అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా బుజబుజ నెల్లూరులోని శేషు ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ నరసింహ గిరి, కరస్పాండెంట్ శేషు, యోగా మాస్టర్ పెంచలయ్య, స్థానిక నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. చిన్నారులతో పాటుగా పెద్దలందరితోనూ యోగా మాస్టర్ ప్రాణాయామం, ధ్యానం, ఆసనాలను చేయించారు. ఎటువంటి వ్యాధినైనా యోగాసనాలతో నయం చేయవచ్చని యోగా సార్, ప్రతిరోజు యోగసాధనకు సమయం కేటాయించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని శేషు సెలవిచ్చారు. అనంతరం పెంచలయ్యను నరసింహ గిరి శాలువాతో సత్కరించారు. అల్పాహార విందుతో వేడుకలు ముగిశాయి.

'బుర్రా' కు మాతృవియోగం

ప్రజాశక్తి-కందుకూరు



మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ మాతృమూర్తి బుర్రా లక్ష్మమ్మ వయోభారం వలన శుక్రవారం మరణించారు. శనివారం ఉదయం 10:00 గంటలకు ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, శివపురం గ్రామం లో అంతిమ సంస్కార కార్యక్రమాలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వైఎస్ఆర్‌పిపి కందుకూరు నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు,నాయకులు బుర్రా మధుసూదన్ యాదవ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.మాతృమూర్తి లక్ష్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారని జె సి ఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

చుంచులూరు వాసికి కెనడాలో అరుదైన గౌరవం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని చుంచులూరు గ్రామానికి చెందిన వేమన ఓబయ్య కుమారుడు వేమన వెంకట సురేష్‌కు కెనడాలో అరుదైన గౌరవం లభించింది. కెనడాలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అల్బెట్ట యూనివర్సిటీ గౌరవ గవర్నర్‌గా కెనడా ప్రభుత్వం వీరిని నియమించింది. ప్రస్తుతం వీరు కెనడా దేశంలో టెక్నికల్ హై స్పీడ్ రైల్ ప్రాజెక్ట్ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు పదవ తరగతి వరకు చుంచులూరు ప్రభుత్వ పాఠశాలలో చదివారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తికి ఇతర దేశంలో అరుదైన గౌరవం లభించడంతో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి అభినందనలు తెలియజేశారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేట మండలం గుంపర్లపాడు గ్రామంలో గ్రాడ్యుయేషన్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త బి.సంపూర్ణ మాట్లాడుతూ గుంపర్లపాడులోని అంగన్‌వాడీ సెంటర్-2లో ఈ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు పూర్వవిద్యార్థులు నూతన విద్యార్థులు కలిసి గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి తెలుగు స్కూల్ ఉపాధ్యాయుడు సూర్యనారాయణ, ఉర్దూ స్కూల్ ఉపాధ్యాయుడు ఖాదర్ భాషా, పెద్ద సంఖ్యలో గ్రాడ్యుయేట్స్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కబ్జా దారుల నుంచి విముక్తి..!

- కోటంరెడ్డి చొరవతో బాధితులకు అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి



మాట్లాడుతున్న బాధితులు

అధికారం ఉన్నంత సేపు అక్రమాలకు తెరలేపిన వైసిపి నేతల చుట్టూ ఉచ్చుబిగుస్తోంది. నెల్లూరు రూరల్ మండలం, దేవరపాళెంలో ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు భూములు కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలిసింది. వైసిపి నేతలు వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, ఆనందరెడ్డి, హంసకుమార్‌రెడ్డిలు ఈ స్థలానికి కంచెవేశారు. అధికారపార్టీ నేతలు కావడంతో రెవెన్యూ, పోలీసులు నోరు మెదపడంలేదు. సివిల్ వ్యవహారం మాకు సంబంధం లేదంటూ తప్పించుకున్నట్లు తెలిసింది. అటు తరువాత ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని బాధితులు కలిసినట్లు తెలిసింది. ఆయనతో మాట్లాడుకొని సర్దుబాటు చేసుకోవాలని సలహా ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. అప్పట్లో స్థానిక ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని బాధితులు కలిసి తమ సమస్యలను తెలియజేశారు. పార్టీ అధికారంలోకి వస్తానే సాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల టిడిపి అధికార పగ్గాలు తీసుకున్న తరువాత బాధితులు ఎంఎల్ఎను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన రెవెన్యూ, పోలీసు అధికారులు కబ్జా కోరల్లో ఉన్న భూములను బాధితులకు అప్పగించారు. శుక్రవారం సొంత స్థలం కలిగిన వారు తమ భూములను అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. అక్కడ బాధితులు విలేకర్లతో మాట్లాడారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు వారి అండ చూసుకొని నెల్లూరు రూరల్ దేవరపాళెంలో తాము కొనుగోలు చేసిన ప్లాట్లను వైసిపి నేతలు వేమిరెడ్డి అశోక్ రెడ్డి, ఆనందరెడ్డి, హంస కుమార్ రెడ్డి ఆక్రమించారని ఈ విషయాన్ని అప్పటి వైసిపి ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తే భూ కబ్జాదారులకు వత్తాసు పలికారని కానీ నేడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఆ భూములను కొనుగోలు చేసిన వారికి తిరిగి న్యాయం చేశారని ప్లాట్ల కొనుగోలుదారులు రంగశెట్టి సురేష్ బాబు, ఆకుల రాజేష్‌లు పేర్కొన్నారు. దేవరపాలెం గ్రామంలో సర్వేనెంబర్ 238, 239, 389 లో మొత్తం 18. 23 ఎకరాల భూమిని వేమిరెడ్డి కుటుంబీకులు తమకు 2003లో అమ్మారనిఅధికార బలంతో తిరిగి ఈ ఏడాది జనవరిలో వాటిని ఫెన్సింగ్ వేసి ఆక్రమించుకున్నారన్నారు. ఇది అన్యాయమని ఆదాల దృష్టికి తీసుకువెళ్లిన తమకు న్యాయం చేయలేదన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గెలుపు పొందగానే వెంటనే స్పందించి రెవెన్యూ, పోలీస్ అధికారులు పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి 90 మంది కొనుగోలుదారులకు తిరిగి ప్లాట్లను సర్వే చేసి కేటాయించారన్నారు. తమకు న్యాయం చేసిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై హర్షం

ప్రజాశక్తి-కోవూరు : వైసిపి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రద్దు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపాలెం గ్రామంలోని రైతులు కొల్లా మధురెడ్డి, కొల్లా ఆదిశేషారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రవీంద్రరెడ్డి మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కరంగా తయా రైన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని సిఎం చంద్రబాబు నాయుడు రద్దు చేయడం సంతోషకరమన్నారు. ఈ చట్టం రద్దుపై ప్రతిఒక్క రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

కాలువల్లోని జమ్ము తొలగించండి..

- ఎపి రైతు సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



కాలువలో పెరిగిన జమ్ము

మురుగునీరు వెళ్లే కాలువల్లో జమ్ము పెరిగిపోవడంతో నీళ్లు సక్రమంగా వెళ్లడం లేదని పక్కనున్న పంట పొలాల్లో మురుగునీరు పారి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే జమ్ము తొలగించాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలోని వెంకటరావు పల్లె పొలాలకు వెళ్లే సాగునీటి కాలువలో జమ్ము అధికంగా ఉందని తెలిపారు. జమ్ము ఏపుగా పెరగడంతో నీళ్ల కాలువలో వెళ్లకుండా పక్కన ఉన్న పొలాలపై ముంపు పడుతుందని తెలిపారు. వెంకట్రావు పల్లె పొలాలకు వెళ్లే సాగునీటి కాలువలో మురికి నీరు వదిలిన సంగతి పురపాలక శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కాలువలో జమ్ము విపరీతంగా పెరిగి ఈ మురుగు నీరు పొలాల్లోకి ప్రవహిస్తోంది. అందువల్ల ఆ ప్రాంతంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఒక్కసారి పరిశీలించి సుమారు 50ఎకరాల పొలాలకు చెందిన రైతుల ఇబ్బందుల్లో దృష్టిలో పెట్టుకొని మురుగనేటి నివారణ తొలగించాలని జమ్ము సైతం తొలగించాలని కోరారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి-అనంతసాగరం : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలను మండలంలో సమర్థవంతంగా నిర్వహించిన డిప్యూటీ తహశీల్దార్ గిరీష్‌కు ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత శుక్రవారం ప్రశంసాపత్రం అందజేశారు. తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది, విఆర్ఓ, విఆర్ఎ, డిప్యూటీ తహశీల్దార్‌ను అభినందించారు.

అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో 'బడిబాట'

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం అంగన్‌వాడీ-2 కేంద్రంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని కావలి ప్రాజెక్ట్ బోగోలు సెక్టార్ సూపర్‌వైజర్ కోటేశ్వరి ఆధ్వర్యంలో పిల్లలతో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ లక్ష్మి, ఏ ఆదిలక్ష్మి, పి నిర్మల, జి ఝాన్సీ రాణి, పి రమాదేవి బీపి రాణి, పి కృష్ణవేణి, ఆయమ్మ శారద, పిల్లల తల్లులు, పిల్లలు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

చిరుత సంచారం అపోహలే..

ప్రజాశక్తి-ఉదయగిరి

చిరుతపులి సంచారం మేకపై దాడి అంటూ వస్తున్నవి అవాస్తమని ఆ వదంతులను నమ్మరాదని అటవీ శాఖ రేంజర్ అధికారి తుమ్మల ఉమామహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యవసాయ కళాశాల సమీపంలోని నర్సరీ పైభాగంలో మేకల గుంపుపై పులి దాడి గొర్రెల కాపరి సమాచారంతో ఒక్కసారిగా పట్టణ గ్రామప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ రేంజర్ తుమ్మల ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మేకను చంపింది చిరుత పులి కాదని, ఇది కుక్కలు దాడని స్పష్టం చేశారు. చిరుత దాడి అనేది అవాస్తవమని ఆ వదంతులను నమ్మవద్దని ఆయన కోరారు. గ్రామాల జనసంచారం సమీప ప్రాంతాల్లో పులి సంచరించదని అటవీ ప్రాంతంలోకి ప్రజలు వెళ్లరాదన్నారు. కార్యక్రమంలో సిఐ గిరిబాబు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-వరికుంటపాడు

యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని హైస్కూల్స్, యూపీ స్కూల్స్, ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిసి యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి నట్లు మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు యల్ వి నారాయణ, వి.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం వెంటనే 117 జిఒను రద్దు చేయాలని 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలోనే కొనసాగించాలన్నారు. అమ్మఒడి పథకం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. త్వరలో ప్రమోషన్ ద్వారా హైస్కూల్లో ఉన్న సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చూడాలని, లేదా వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ డైరెక్టర్ కరిముల్లా, సీనియర్ నాయకులు ఎం.సుబ్బారావు, జిల్లా ప్రతినిధి ఆర్ నాగార్జున, కాంతారావు, దామోదర్, మనోహర్, ఆర్.వెంకటేశ్వర్లు, చిన్న రామయ్య, రవూఫ్, హజరత్, రాజేంద్ర, వెంకట సుబ్బయ్య, జివి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం చేపడుతున్న ఉపాధ్యాయులు

ఎంఎల్ఏగా కాకర్ల ప్రమాణ స్వీకారం


ప్రజాశక్తి-ఉదయగిరి



ఉదయగిరి నియోజకవర్గం శాసన సభ్యునిగా కాకర్ల సురేష్ రాష్ట్ర శాసనసభలో ఎంఎల్ఏగా ప్రమాణస్వీకారం చేశారు. శుక్రవారం అమరావతిలోని శాసనసభలో ప్రొటోకాల్ స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి కాకర్ల సురేష్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడానికి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఎల్ఏగా ప్రశాంతిరెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-విడవలూరు



కోవూరు ఎంఎల్ఏగా భారీ మెజారిటీతో గెలుపొందిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అమరావతిలోని రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకరణ అనంతరం ఆమె ప్రొటీం స్పీకర్ గోరంట్ల బచ్చయ్య చౌదరిని, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుని, యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ని, ఇతర పెద్దలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు.

ఎంఎల్ఏగా 'ఇంటూరి' ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక, తొలి అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం మొదలయ్యాయి. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కందుకూరు శాసనసభ్యుడిగా తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేసిన ఇంటూరి నాగేశ్వరరావు, స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి ప్రొటెం స్పీకర్ కు అభివాదం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్ లను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. నాగేశ్వరరావు సతీమణి సౌజన్య, కుమారులు అవినాష్, సందీప్ లు గ్యాలరీలో కూర్చుని ప్రమాణస్వీకారాన్ని వీక్షించారు.



సిఎంను కలిసిన ఇంటూరి


2022లో కందుకూరు టిడిపి ఇన్చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరరావు పార్టీ క్యాడర్ లో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నడిపించారు. అటు సేవ, ఉపాధి కార్యక్రమాలను చేపట్టి మంచి పేరు తెచ్చుకున్నారు. దీంతో నారా చంద్రబాబునాయుడు, ఇంటూరి నాగేశ్వరరావు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి బీఫారం అందించారు. గతంలో ఎప్పుడూ రానంత మెజారిటీతో నాగేశ్వరరావు గెలుపొందగా, 20 సంవత్సరాల తర్వాత కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడింది. ప్రమాణ స్వీకారం అనంతరం మీడియాతో ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను శాసనసభ్యుడిగా ఎన్నికయ్యేందుకు అవకాశం కల్పించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకి సర్వదా రుణపడి ఉంటానని అన్నారు. ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే సచివాలయంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావును కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎంఎల్ఏగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

ఎంఎల్ఏగా కావ్య క్రిష్ణారెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-కావలి



కావలి ఎంఎల్ఏగా భారీ మెజారిటీతో గెలుపొందిన దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి (కావ్య క్రిష్ణారెడ్డి) అమరావతిలోని అసెంబ్లీలో శుక్రవారం మధ్యాహ్నం 1.22 నిమిషాలకు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకరణ అనంతరం ఆయన ప్రొటీం స్పీకర్ గోరంట్ల బచ్చయ్య చౌదరిని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని, యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను ఇతర పెద్దలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిని కలిసిన ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : రాష్ట్ర రోడ్లు , భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి శుక్రవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.కందుకూరు నియోజక వర్గ విషయాలు ఇద్దరు చర్చించుకున్నారు.